## ఎరువుల కొరత పరిష్కరించాలి : ఎంపీపీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మండలంలో ఎరువులు కొరత అధికంగా ఉందని తక్షణమే పరిష్కరించాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు వ్యవసాయ అధికారి అనురాధని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఇన్చార్జ్ ఎంపీడీవో శివాజీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుత సీజన్ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని, అధికారులు సక్రమంగా ఏది సమాచారం ఇవ్వడం లేదని ఇకపై ఖచ్చితంగా సమాచారం ఇవ్వకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎంపీటీసీ నేతేటి వెంకటరమణ అన్నారు. ఎరువులు కొరతను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టిలో పెట్టి పరిష్కార దిశగా కృషి చేస్తామని, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షురాలు వంగపండు అలివేణి, ఎంపీటీసీలు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు... ఎండుతున్న వరి పొలాలు

- ఆకాశం వైపు ఎదురుచూస్తున్న రైతన్నలు
- రెండురోజుల్లో వర్షాలు పడకపోతే కరువే

విశాలాంధ్ర-వేపాడ : ఈ ఏడాది ఋతుపవనాలు ముందుగానే రావడం వరి పంటకు అనుకూలిస్తుందన్న ఆశతో ఉన్న రైతన్నలు వరి నాట్లు ముందుగానే వేశారు. అయితే వరి నాట్లు దాదాపు 60 శాతం పూర్తయినట్లేనని రైతాంగం చెబుతున్నారు. అయితే గత పది రోజులుగా వర్షాలు ఎత్తిగట్టడంతో వేసిన వరినాట్లు ఎండిపోవుతున్నాయి. వరి నాట్లు మాట ఎలా ఉన్నా ఎద వరి వేసిన రైతుల యొక్క వరి పొలాల్లో వరి పూర్తిగా ఎండిపోయే స్థాయికి చేరుకుంది. దీంతో ఏం చేయాలో తోచక రైతన్నలు వరుణుడు కరుణించడా అన్న ఆశతో ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అలాగే ఎకరాకు రూ.20వేలు పైగా పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేశామని, తీరా 10 రోజులుగా కాస్తున్న ఎండలకు వేసిన వరి నాట్లు ఎండిపోతుండంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిణి ఎం.స్వాతిని అడగ్గా... :

మండలంలో ఈ ఏడాది 3546 హెక్టార్లలో వరి నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1670 హెక్టార్ల లో వరినాట్లు వేశారన్నారు. అలాగే మరో 55 హెక్టార్లలో ఎదజల్లారని, అయితే ప్రస్తుతం ఎండలు విపరీతంగా కాయడం... దానికి తోడు నీటి ఎద్దడి సమస్య కారణంగా వేసిన వరి నాట్లు తో పాటు జల్లిన ఎదలు కూడా ఎండిపో తున్నాయి. వర్షాలు కురిసే వరకు ఎండలను తట్టుకు నేందుకు 19-19-19 కాంప్లెక్స్ ఎరువు(యూరియా) ఒక కేజీ ఎకరాకు పిచికారి చేస్తే ఎండలకు తట్టుకుంటుందన్నారు. అలాగే యూరియా కూడా 11 క్లస్టర్లలో 12 రైతుసేవ కేంద్రాల్లో 145 టన్నులు యూరియా,36 టన్నులు డిఏపి నిల్వ చేయడం జరిగిందన్నారు.కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల్లో వారి పట్టాదార్ పాస్ పుస్తకాలు ద్వారా యూరియాను తీసుకోవచ్చున్నారు. అలాగే మరో నాలుగు ఐదు రోజుల్లో వర్షాలు పడనట్లయితే వరి నాట్లకు ముప్పు తప్పదని కావున వరి వేసిన రైతులందరూ వరి పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆమె అన్నారు.

## గంజాయి నియంత్రణే లక్ష్యంగా కిరండాల్ ట్రైయిన్లో ఆకస్మిక తనిఖీలు ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా ఆగస్టు 2న రాత్రి కిరండాల్ పాసింజరు ట్రెయిన్లో లోకల్ పోలీసు, జి.ఆర్.పి., ఈగల్, ఆర్.పి.ఎఫ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్తో సంయుక్తంగా బృందాలను ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - రాష్ట్ర డిజిపి ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ఈగల్, లోకల్ పోలీసు, గవర్నమెంట్ రైల్వే పోలీసు, డాగ్ స్క్వాడ్ మరియు రైల్వే ప్రొటక్షన్ పోలీసులతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటుచేసి, కిరండల్ పాసింజరు ట్రెయిన్లో ఆకస్మిక తనిఖీలునిర్వహించామన్నారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా రాష్ట్రం నుండి ట్రెయిన్స్ ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణ అవుతుందన్న సమాచారంతో ప్రత్యేకంగా ట్రెయిన్స్ ను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు చేపట్టామన్నారు. ఈ బృందం ఎస్.కోట రైల్వే స్టేషనులో కిరండల్ పాసింజరు ట్రెయిన్ లో కొత్తవలస వరకు ప్రయాణించి, బృందాలుగా ఏర్పడి అన్ని భోగీల్లోను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. పోలీసు సిబ్బందికి, అధికారులకుప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి ముందుగా వివరించారు. కిరండల్ పాసింజరు ట్రెయిన్లోని అన్ని భోగీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బ్యాగులను, లగేజ్, సూట్కేసులను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ట్రెయిన్లో ఎవరికి చెందనదిగా ఆరు కిలోల గంజాయి, ఒక వ్యక్తి వద్ద నుండి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల నిమిత్తం జిఆర్పీ పోలీసులకు అప్పగించామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో ఎస్.కోట సిఐ వి.నారా యణ మూర్తి, వల్లంపూడి ఎస్ఐ ఎస్.సుదర్శన్, జిఆర్పీ ఎస్ఐ బాలాజీరావు,ఆర్పీఎఫ్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు డాగ్ స్క్వాడ్ సిబ్బంది, ఈగల్ టీమ్ పోలీసులు, 40మంది పోలీసు అధికారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలి

### పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దయానంద్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: పారా జూనియర్, సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ అభినందించారు. ఆదివారం విజయనగరంలో గల సారథి వెల్ఫేర్ అసోసియేషన్ బ్లైండ్ స్కూల్ లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 135 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారని, వీరిలో 47 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఇదేస్ఫూర్తి తో ఈనెల 9న విశాఖలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలోనూ సత్తాచాటి జిల్లాకు పేరు తీసుకురావాలని, అలాగే హర్యానా లో జరుగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్, అమ్మ సేవాసంఘం వ్యవస్థాపకులు లక్కీ శేఖర్, మహేష్, కిరణ్ కుమార్, శర్మ, వెంకటరావు, పారా క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో ప్రజలు సుభిక్షంగా బతికారు

### మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : గత వైసిపి పాలనలో ప్రజల సుభిక్షంగా బ్రతికారని ఎస్ కోట వైసీపీ మండల పార్టి అధ్యక్షులు మోపాడ కుమార్ అన్నారు. మండలంలోని వినాయకపల్లి గ్రామంలో ఆదివారం వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, జడ్పిటిసి సభ్యురాలు ముమ్ములూరి వెంకటలక్ష్మి తదితర వైసిపి శ్రేణులతో కలిసి బాబు షూరిటీ మోసాలకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటమి మేనిఫెస్టోలో అమలుకాని హామీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గత వైసిపి పాలనలో ప్రజలకు ఇళ్ళ వద్దకే సంక్షేమ పథకాలు అందేవని కొనియాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల ఎస్సీ కమిటీ అధ్యక్షులు జయశంకర్, మాజీ ఫోక్ బోర్డు డైరెక్టర్ వాకాడ రాంబాబు, పోతనాపల్లి సర్పంచ్ వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులను అందించిన మంత్రి

విశాలాంధ్ర-విజయనగరం : ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సీఎం సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను తమ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆదివారం మంత్రి శ్రీనివాస్ అందజేశారు. గంట్యాడ మండలం రేగుబిల్లి గ్రామానికి చెందిన కంచి పద్మావతికి రూ. 1,16,414, గజపతినగరం మండలం ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన పట్నాన సురేష్ కుమారుడు సూర్య సాత్విక్ రూ.48,401 విలువైన చెక్కులను అందజేశారు. వీటితో పాటుగా బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు రాసిన లేఖను కూడా బాధితులకు మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 320 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత

### ఆటో సీజ్ కేసు నమోదు - ఎస్సై సుదర్శన్

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో వేపాడ సోంపురం రహదారిలో వల్లంపూడి సమీపంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 320 కేజీల పౌరసరఫరాల బియ్యాన్ని పట్టుకున్నట్లు వలంపూడి ఎస్సై ఎస్.సుదర్శన్ తెలిపారు.బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేయడం జరిగిందని ఈ మేరకు కేసు నమోదు చేసి సోమవారం సివిల్ సప్లై అధికారులకు బియ్యాన్ని అందిస్తామని ఎస్ఐ సుదర్శన్ తెలిపారు.

## బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-గుర్ల: గుర్ల తెట్టంగి సొసైటీ చైర్మన్ గా ఆదివారం తిరుమలరాజు కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు రాజేష్ వర్మ, తెదేపా నేతలు కే త్రిమూర్తులు రాజు, వెన్నె సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ ను పలువురు నాయకులు అభినందించారు.

## సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్(సీతం), కె స్క్వేర్ ఇన్ఫో మధ్య ఎంఓయు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, కె స్క్వేర్ ఇన్ఫో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కె స్క్వేర్ ఇన్ఫో (స్కిల్ మేథ) సంస్థ ఇంటర్న్షిప్స్, క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ, విదేశీ విద్య మార్గదర్శకత్వం కల్పిస్తారు. వీరు ఆన్లైన్ లో విద్యార్థులకు విద్య మరియు క్యారిర్ లక్ష్యాలకు అనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘ కాలిక ఇంటెన్షిప్స్ అందించడంలో సహాయపడుతుంది. స్కిల్ మేథ అనే అభ్యాస నిర్వహణ వ్యవస్థ (ఎల్ఎమ్ఎస్) ఇది వ్యక్తిగతికరించిన అబ్యాస మార్గాలు (అర్థఫిషల్ ఇంటలిజెన్స్). నిజ-సమయ పురోగతి ట్రాకింగ్, ఎ1 ఆధారిత అభిప్రాయంతో విద్యార్థులను శక్తివంతం చేయడానికి రూపొందించబడింది. స్కిల్ మేథ లో స్వీయ-అభ్యాస ఇంటరాక్టివ్ ఏఐ అభ్యాసం, 27o ప్లాట్ఫారం తో కూడిన కోడింగ్ సాధన వేదిక కూడా ఉన్నాయి. అంతేకాక విదేశీ విద్య మార్గదర్శకత్వం, విదేశీ విద్యకు మద్దతు-కౌన్సెలింగ్, దరఖాస్తు సహాయం, విద్యా రుణ సహాయం, వీసా మార్గదర్శకత్వం, ఆంగ్ల ప్రావీణ్య శిక్షణ (ఐల్ట్స్, జీఆర్ఇ, టోఫెల్, డ్యూలిగో, పిటిఇ, జిమెట్), విదేశాలలో ఉన్నత విద్యకు ప్రవేశానికి మద్దతు కూడా అందజేస్తుంది. కేస్క్వేర్ ఇన్ఫో సంస్థ శ్రీధర్ మాట్లాడుతూ స్కిల్ మేథ నుంచి విద్యార్థులు ఎంతగానో నేర్చుకుంటారు అని అనేక లాభాలు ఉంటాయని తెలిపారుసీతం కళాశాల ప్రిన్సిపాల్ డాఎం డి వి రామమూర్తి కె స్క్వేర్ ఇన్ఫో సంస్థ ఎమ్ డి శ్రీధర్ ఒప్పంద పత్రాలు పై సంతకం చేశారు. సీతం కళాశాల డైరెక్టర్ డాఎం మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఇ సంస్థ తో ఒప్పొందం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది అని అయన తెలియజేసేరు.

# హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న కూటమి సర్కార్

### జిల్లా టిడిపి నేత కిమిడి

విశాలాంధ్ర-చీపురుపల్లి : కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వైసీపీ నాయకులకు కనిపించకపోవడం దారుణమని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 80 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. పింఛను వెయ్యి రూపాయలు పెంచడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదు సంవత్సరాలు పట్టిందని, కుటమి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్క సంతకంతోనే ఒకేసారి మూడు నెలల బకాయి తో పాటు 1000 రూపాయలు పెంచి అమలు చేసి చూపించారన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలపై హామీలు ఇవ్వకపోయినా కూటమి ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చేదని, దీన్ని వైసిపి నాయకులు గుర్తించాలని హితవు పలికారు. సంక్షేమ పథకాలకోసం కాకుండా మంచి పరిపాలన కావాలని, మద్యం, ఇసుక అవినీతి ఉండకూడదని, శాంతిభద్రతల పరిరక్షణ ఉండాలనే భావనతోనే రాష్ట్ర ప్రజలు కూటమికి అధికారమిచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింపు చేసిందని, అన్నదాత సుఖీభవ పథకం అమలు చేశామని, అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించామని తెలిపారు. ఆగస్టులోనే మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నాం. ఎన్నికలు హామీలు ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం. ఇవేవీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకి, జిల్లాకు చెందిన వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని నిలదీశారు. వైసిపి నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. వైసీపీ నాయకుల మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు.

## నేడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరణ

### తహసీల్దార్ సులోచన రాణి

విశాలాంధ్ర-మెరకముడిదాం: :స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ సులోచన రాణి తెలిపారు. ఈపిజిఆర్ఎస్ కార్యక్రమంలో మండల ప్రజలు ఎటువంటి సమస్యలు వున్నా ఫిర్యాదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు కు ఘన సన్మానం

విశాలాంధ్ర-బొబ్బిలి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా, సంస్థానం ఉన్నత పాఠశాల 10వ తరగతి 1989-90 పూర్వ విద్యార్థులు వారి ఆప్తమిత్రుడు రాంబార్కి శరత్ బాబు మున్సిపల్ చైర్మన్ పదవి చేపట్టిన శుభ సందర్భంగా మిత్రులందరూ శరత్ బాబు ని సత్కరించు కొని ఆయనతో ఉన్న అనుభవాలను ఈరోజు గుర్తు చేసుకుని ఈ కార్యక్రమాన్ని స్నేహితుల దినోత్సవం నాడు సుమారు ఒక 150 మంది మిత్రులు కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు కు ఘన సన్మానం చేశారు.

## జిందాలకు భూమి ఇచ్చినందుకు చావే శరణ్యమా?

### ఉరితాళ్లు మెడకు కట్టుకొని జిందాల్ నిర్వాసితులు నిరసన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలం లోని బొడ్డవరలో జిందాల్ కి భూములు ఇచ్చిన గిరిజన, దళిత రైతులు ఆదివారం ఉరితాళ్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం తట్టుకోలేక చావుకు సిద్ధపడాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. జిందాల్ కంపెనీ కడతానన్న భూములు వేరేగా బదలాయించి రియల్ ఎస్టేట్ సిద్ధపడటంతో మమ్మల్ని ఆదుకోవాలని 45 రోజులుగా ఆందోళన లు చేపడుతున్న జిందాల్ యాజమాన్యం గాని ప్రభుత్వం గానీ స్పందించకపోవడం విచారకరమన్నారు. కంపెనీ కడితే ఉద్యోగాలు వస్తాయని మా దగ్గర ఉన్న భూములు సర్వస్వం జిందాల కంపెనీకి ఇచ్చేసి కూలీలుగా మారేమని, కంపెనీ లేక ఉద్యోగం లేక కంపెనీలో వాటా లేక కళ్ళముందే వేరే ఒకరికి భూమి బధలాయిస్తుంటే పోరాటమే శరణ్యమని రోడ్డు మీదకు వస్తే పోలీసు నిర్బంధంతో రోడ్డు మీద కూడా రానికపోవడంతో మొత్తం భూమి కోల్పోయిన గిరిజన దళిత రైతులకు చావుతప్ప వేరే మార్గం కనిపించటం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జందాలతో జరుగుతున్న పోరాటంలో రైతులతో చేసుకున్న ఒప్పందాలను జిందాల్ అమలుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. భూములు కోల్పో తున్నాం అన్న బాధలో ఏ ఒక్కరు మరణించిన ఆ మరణం జిందాల్ దే బాధ్యత అన్నారు. తక్షణమే గిరిజన దళిత రైతులును ఆదుకోవాలని డిమేండ్ చేసారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: స్థానిక కొత్త అగ్రహారంలో గల సుజాత జూనియర్ కాలేజీలో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఆదివారం జిల్లాస్థాయి అండర్ 19చెస్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ చెస్ టోర్నమెంట్ కి సుమారుగా 120 క్రీడాకారులు జిల్లా వ్యాప్తంగా హాజరవడం జరిగింది. బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ఎ.రావు మంగవేణి సర్కిల్ ఇన్స్పెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ 19 బాలుర విభాగం నుండి మొదట నాలుగు స్థానాల్లో అలాగే అండర్ 19 బాలికల విభాగంలో నలుగురు బాలికలు 8, 9 తేదీల్లో కర్నూల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవటం జరిగింది. క్యాటగిరిలో అండర్ 9, అండర్ 11 అండర్ 13 అండర్ 15 బాల బాలికలకు ప్రత్యేకంగా బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎ .రావు , ముఖ్య అతిథులు మంగవేణి సర్కిల్ ఇన్స్పెక్టర్, చీఫ్ ఆర్బిటర్ మణిరత్నం మరియు ఇతర ఆర్బిటర్స్ అర్చన, శ్రీనివాస్, సైదా బేగం ప్రసాద్ టోర్నమెంటు డైరెక్టర్ ఆర్వి తిరుపతి రావు, కళాశాల అధ్యాపకులు ఆనంద్, విజయ్, సాయి, సంధ్య, ఉమ, చంద్రయ్య, ఉషారాణి, క్రీడాకారుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎం ఇ ఓ గా రమేష్కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర-బొబ్బిలి: మండల విద్యాశాఖాధికారి1 గా (పూఅభా) చిప్పాడ రమేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రమేష్ కుమార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గత నెల పదవీమరణ సందర్భం గా ఖాళీలు అయిన స్థానాల్లో భర్తీ చేస్తూ ప్రాంతీయ ఉప సంచాలకులు ఆదేశాలు జారీచేశారు.

## స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక

విశాలాంధ్ర -విజయనగరం: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఐదుగురు సభ్యులు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారని, అయితే గతంలో ఉన్న ఐదుగురు సభ్యులే ప్రస్తుత ఎన్నికల్లో నామినేషన్ వేసినందున ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేదని అందువల్ల నామినేషన్ వేసిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, ప్రచురిత పత్రాలను నోటీసు బోర్డులో అతికించారని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఫారం 8, 12 అనుసరించి, స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సభ్యులకు ఫారం12 వివరాలను అందించారని, పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు వీరే. ఎస్వివి రాజేశ్వరరావు, అల్లు చాణిక్య, జివి రంగారావు, సుంకరి నారాయణ స్వామి, రేగాన రూపా దేవి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరం

### ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభాషిని

విశాలాంధ్ర-డెంకాడ: తల్లిపాలు తాగడం వల్ల పిల్లలకు ఎంతో ఆరోగ్య కరంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభాషిని అన్నారు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం డెంకాడ చొల్లంగి పేట గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు విధిగా పట్టాలని దానివల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రానివ్వకుండా తల్లిపాలే కాపాడతాయని తెలిపారు ముఖ్యంగా ప్రతి బాలింత మురిపాలు పిల్లలకి ఇవ్వాలని దాని వల్ల పిల్లలు చురుకుగా ఆరోగ్యంగా పెరుగుతారని అన్నారు అలాగే ప్రతిరోజు తల్లి బిడ్డ శుభ్రంగా ఉండటం ఎంతో అవసరం అన్నారు ఈ కార్యక్రమం ఈనెల7 తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు ఈ డెంకాడ చొల్లంగి పేట గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చొల్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు కే సుభాషిని కే రమణమ్మ అంగన్వాడి టీచర్లు కార్యకర్తలు బాలింతలు పాల్గొన్నారు.

## కర్షలు సేదతీరేలా విశ్రాంతి భవనం...

విశాలాంధ్ర-వంగర: మండలం లో వీవీ ఆర్ పేట పంట పొలాల్లో పొలాలకు వెళ్ళే రైతులకోసం వివి.ఆర్ పేట గ్రామం నుంచి పెద్దింపేట వరకూ ఉన్న పంటపొలాలకు వెళ్లే రహదారి మార్గంలో రైతులకు ఉపయోగపడేలా విశ్రాంతి భవనాన్ని ఏర్పాటుచేశారు. గ్రామానికిచెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మిరియాల వెంకటనాయుడు తన సొంత నిధులతో ఈ విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. తల్లిదండ్రులు మిరియాల కృష్ణమూర్తినాయుడు, సూరీడమ్మ దంపతుల జ్ఞాపకార్థం రెండు లక్షల పదివేల రూపాయలతో కర్షకులకు ఎండ, వర్షం బాధ నుండి విముక్తి పొందేందుకు పంటపొలాలకు వెళ్ళే రహదారి మధ్యలో ఈ భవనాన్ని నిర్మించారు. ఆ షెడ్ పక్కనే ఒక హ్యాండ్ బోర్ కూడా ఉంది. పశువుల కాపరులకు అనుకోకుండా మేఘాలు గర్జించి పిడుగులు పడినా పంట పొలాల దూరంలో ఉండటంవల్ల కొత్తగా నిర్మించిన ఈ షెడ్ అందరికీ ఉపయోగం కరంగా ఉందనేది చెప్పకతప్పదు. ఇలాంటి మంచి కార్యక్రమం చేసినందుకు గ్రామ ప్రజలందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## తేట తెలుగు శతకం పుస్తకావిష్కరణ చేసిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : చింతా రమణ మాస్టారు రచించిన తేట తెలుగు శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈ నెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వలసినదిగా కలెక్టర్ కోరారు.

## మాజీ సైనికుల సమస్యలపై సమావేశం

**విశాలాంధ్ర-బొబ్బిలి:** మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ళ కిరణకుమార్ పర్యవేక్షణలో ఆదివారం అత్యవసర సమావేశం బొబ్బిలి పాత కోటలో గల సైనిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు బొబ్బిలిలో మాజీ సైనికులచే ఘనంగా నిర్వహించాలని.. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం నిర్వహణకు కావలిసిన విధివిధానాలను ఆయన సూచించారు.

అనంతరం మాజీ సైనికుల సమస్యలపై చర్చించి వీటిని. జిల్లా సైనిక అధికారి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ ఆర్ మోహన్ రావు, కోశాధికారి విఎన్ శర్మ ,మాజీ సైనికులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల స్నేహభావంతో మెలుగుతున్న తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్

**విశాలాంధ్ర-తెర్లాం:** రైతులపట్ల స్నేహభావంతో మెసులుతున్న తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్ విధులు నిర్వహించి ఏడాది పూర్తయింది. రెండవ ఏడాదిలో విధి నిర్వహణలో 5 రోజులు పూర్తయింది. రెవెన్యూ సేవలను రైతులకు వారి జీరాయితి భూములను ఆన్లైన్ లో పొందుపరచడం, రికార్డు లు అవకతవకలు సరి చూడడంలో ఆయనకు ఆయనే సాటి. హేమంత్ కుమార్ రైతులు పట్ల స్నేహ భావాల మధ్య రెవెన్యూ సేవలను కొనసాగిస్తున్నారని ఇలాంటి తహసీల్దార్ మునుపెన్నడూ తాము చూడలేదని పలు గ్రామాల నుంచి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సులలో కుటుంబాలమధ్య, అన్నదమ్ముల మధ్య గత 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న భూ తగాదాలను రైతులు భూములు ఒకరిపై ఒకరు రికార్డులు సరిచూసుకోకపోవడం, రైతుకు భూమి ఒకచోట పాస్‌బుక్ లో ఒన్ బి లో అడంగల్ లో నెంబర్ వేరే చోట ఉండి భూములు మా చేతుల్లో ఉన్నాయి లె మాకేం ఇబ్బంది లేదని అనుకుని పత్రాలు రైతుకి సరైన హక్కు దారులు కాలేక చాలామంది రైతులు ఇబ్బంది పడుతున్న సమస్యలను హేమంత్ కుమార్ తహసీల్దార్ గా రెవెన్యూ రికార్డు లను రైతుల సమస్యలను పరిష్కరించి ఆన్లైన్‌లో రైతులకు హక్కుదారులుగా రికార్డులు పొందుపరచడం ఎంతో సంతోషం అని ఆఫీసు కి వచ్చిన రైతన్నలు సంతోషం గా మాట్లాడుకుంటున్నారు. అలాగే గత 40 ఏళ్లుగా మండలం లో పుల్లేరువలస , చుక్కవలస, గ్రామాల రైతులు భూములను అమ్ముకోవాలి అనుకున్న , కొనాలి అనుకున్న రిజిస్ట్రేషన్ లావా దేవీలు జరగక చాలా ఇబ్బందులు పడే వాళ్ళం అని అలాంటిది ఈ తహసీల్దార్ హేమంత్ కుమార్ కు మా రెండు గ్రామాల భూ రికార్డుల సమస్యలను వినతుల ద్వారా రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు చెయ్యగా మా బాధలను గుర్తించి పూర్వం రికార్డులను పరిశీలించి ఈ గ్రామాల భూములను రిజిస్ట్రేషన్ జరిగేటట్లు పై అధికారుల ద్వారా నివేదికలు పొందుపరచి రైతులు భూములు రిజిస్ట్రేషన్ లావాదేవీలు అమ్మకాలు కొనుగోలు జరిగేటట్లు రికార్డులు పొందుపరచారు అని , నేటి నుండి ఆన్లైన్ లో రైతు భూములు కనిపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది అని పుల్లేరువలస , చుక్కవలస గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆన్లైన్ కుల ధృవీకరణ పత్రాలు కేస్ట్ వారీగా ఒకే వ్యక్తికి రెండు పేర్లు ఉండి బ్యాంకుల్లో కానీ , చదువుకునేందుకు కానీ సమస్యలు ఉండి మండలం లో వందలాది మంది సర్టిఫికెట్లు పెండిగ్గలో ఉండి ఏ పేరుతో కుల ధృవీకరణ పత్రాలు ఉండాలో అల ఎంతో మంది ఇబ్బంది పడినవారి అందరికీ రికార్డులు సరి చేసి సర్టిఫికెట్లు ఇచ్చిన ఘనత తహసీల్దార్ హేమంత్ కుమార్ కు దక్కుతుంది అని , విద్యార్థులు బ్యాంకు లావా దేవీలు జరుపుకున్న ప్రజలు ఆయన కోసం గ్రామాల్లో ప్రతి నోట తహసీల్దార్ అంటే ఇలా ఉంటే ప్రజలకు సమస్యలు అతివేగంగా తీరుతాయని గ్రామాల్లో విద్యార్థులు ప్రజలు అంటున్నారు.అలాగే ఎస్టి సర్టిఫికెట్ లు లేక 25 సంవత్సరాల నుంచి జగన్నాథవలస గ్రామానికి చెందిన ఒక ఎస్టీ విద్యార్థి కి ఆధార్ కార్డు లేక పెద్దలను పట్టుకుని తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతూ ఆకరకి తనువు చాలించి నేను ఏ కేస్టు తెలియని పరిస్థితిలో ఉన్న అని నేను ఎస్సీ కాదు ఎస్టీ కాదు పేరు లేనివాడిని అయిపోయానని బాధ పడుతూ గ్రామ పెద్దల ముందు కన్నీరు పెట్టుకున్న జగన్నాథవలస ఎస్టీ కేస్టు అబ్బాయి సమస్యను తహసీల్దార్ హేమంత్ కుమార్ వచ్చిన తర్వాత తహసీల్దార్ కు ఎస్టీ అబ్బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామ పెద్దలు మధ్య రికార్డు రూపంలో పరిశీలించి ఆ గ్రామం లోనే నివసించినట్లు నిర్ధారణ చేసుకొని ఎస్టీ కుల ధృవీకరణ పత్రం ను అందజేసిన ఘనత తహసీల్దార్ హేమంత్ కుమార్ ది అని జగన్నాదవలస గ్రామ నాయకులు తెలిపిన వివరాలు. ఒకటి కాదు రెండు కాదు తెర్లాం తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పేదవారు చిన్నవారు లేకుండా రాజకీయ నాయకులు పెద్దల దగ్గర ఎటువంటి సమస్యలు అయిన ఎదుర్కొని అందరికీ సేవలు అందించడమే మా రెవెన్యూ అధికారుల పనితీరు అని అలాంటప్పుడే మా విధి నిర్వహణలో మనసుకు సంతోషం గా ఉంటుంది అని ఆఫీసు లో చిరునవ్వుతో అందరి సమస్యలు దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు అని మండలంలో ఆఫీసుకు వచ్చిన రైతన్నలు విలేకర్లతో అంటున్నారు.అలాగే పలువురు మండల స్థాయి నాయకులను తహసీల్దార్ హేమంత్ కుమార్ వచ్చినప్పటి నుంచి రెవెన్యూ సేవలు ఎలా కొనసాగుతున్నాయని విశాలాంధ్ర విలేకర్ల ఫోన్ కాల్ ద్వారా అలాగే కొంతమందిని కలిసి వివరాలు కోరగా వారి తెలిపిన వివరాలమేరకు మాకు ఎటువంటి రెవెన్యూ రికార్డుల పనితీరు చేసేటప్పుడు తను చిరునవ్వు నవ్వుకుంటూ మీ మండల నాయకులకు కానీ ప్రజలకు కానీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నేళ్ళు బట్టి పెండింగ్ వర్క్ లు అయిన మేము చేసి పెట్టడం లో రికార్డులు పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో వచ్చిన మోటేసన్ లు సరి చూసి రికార్డులు పరిశీలించి రాత్రి పగలు తేడా లేకుండా తహసీల్దార్ గా నేను కానీ నా కిందస్థాయి సిబ్బంది కానీ రైతులు సమస్యలు పెండింగ్ లేకుండా ఆన్లైన్ పొందుపరచి రైతు హక్కుదారుడుగా తన పత్రాలను వారికి అందించడమే మా ముఖ్య కర్తవ్యం అని తహసీల్దార్ పని తీరు అలా ఉంటుంది అని పార్టీలకు అతీతంగా నాయకులు ఇస్తున్న సమాచారం. అలాగే తెర్లాం తహసీల్దార్ కార్యాలయం గత 40 సంవత్సరాలుగా ఎంతో మంది తహసీల్దార్ లుగా వచ్చి వెళ్ళిపోతుండేవారు అని హేమంత్ కుమార్ తెర్లాం తహసీల్దార్ గా భాద్యతలు స్వీకరించిన సంవత్సర కాలంలోనే రెవెన్యూ కార్యాలయం రూపురేఖలు మార్చి జిల్లా కలెక్టర్ ఆఫీస్ మాదిరిగా తయారు చేసి ఎ ఏ స్టాఫ్ ఆఫీస్ ఎక్కడ ఉండాలో , మీటింగ్ సమావేశ భవనం ఎక్కడ ఉండాలో రికార్డు రూం భద్రత గా ఎటువైపు ఉండాలో , అన్ని గ్రామాల నుంచి రెవెన్యూ పనులు కోసం రైతులు ఆఫీస్ కు వచ్చేటప్పుడు వాళ్లకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఆఫీస్ కు ఎంతమంది వచ్చిన ఎటువంటి సమస్యలు లేకుండా రైతులను పంపించడమే ముఖ్య ఉద్దేశం గా రెవెన్యూ కార్యాలయం తీర్చిదిద్దిన తహసీల్దార్ హేమంత్ కుమార్. ఈ విషయాలు అన్నిటి మీదా తహసీల్దార్ హేమంత్ కుమార్ ను శుక్రవారం విశాలాంధ్ర విలేకర్ కలసి సార్ మండలం మొత్తం మీద ప్రజలు కానీ నాయకులు కానీ మీ పనితీరు పట్ల సంతోషం గా ఉండడం నిజమేనా సార్, రికార్డుల పనితీరు పెండింగ్ లేకుండా చేస్తున్నారు అని అంటున్నారు ఈ విషయాలు పై మీ అభిప్రాయం తెలపండి సార్ అని అడుగగా తహసీల్దార్ హేమంత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నాదేం ఉంది ఈ మండల రెవెన్యూ అధికారిగా నేను విధి నిర్వహణలో నా వంతు భాధ్యత నిర్వహిస్తూ నేను మరొక మండలం బదిలి లో వెళ్ళిపోయేటప్పుడు ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు కానీ ప్రజలు కానీ నాపై ఆదరఅభిమానాలు ఉంటే అది నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తాయి అని అంతకు మించి ఇంకేం లేదని తహసీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు.

## బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత జంధ్యాలు పంపిణీ

**విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్:** బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గాయత్రి భవనం శ్రావణమాసంలో వచ్చే జంధ్యాల పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం కోట కూడలి వద్ద బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత జంధ్యాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షులు పూడి పెద్ది రమణమూర్తి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ద్వారా గత 15ఏళ్ళుగా ఉచిత జంధ్యాల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. యజ్ఞోపధారణ చేసుకునే వారికోసం ఈఏడాది 5వేలమందికి ఉచితంగా జంధ్యాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భరద్వాజ చక్రవర్తి, ఉపాధ్యక్షురాలు భోగరాజు సూర్య లక్ష్మి , భరద్వాజ ప్రకాష్ , కోశాధికారి సత్య కామ, సీనియర్ సభ్యులు భోగరాజు బాబూజీ ధవళ వెంకట రావు, తరిగొప్పుల ప్రకాశరావు సూరి దామరాజు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి గీతాల పోటీలు

**విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్:** రోటరీ క్లబ్ విజయనగరం కమ్యూనిటీ ప్రాజెక్టులో భాగంగా రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న కొత్తగ్రహారం లో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ లో ఆదివారం ఉదయం దేశభక్తి గీతాల పోటీలు ఆసక్తి గా జరిగాయి. అకాడమీ ప్రిన్సిపాల్ డా. మండపాక రవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మన దేశంపట్ల అత్యంత భక్తిగా అంకిత భావంతో ఉండాలని ప్రసంగించి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. సుమారు వందమందికి పైగా పోటీల్లో పాల్గొని తమ దేశభక్తిని పాటలరూపంలో చాటారు. ఈపోటీల గెలుపొందిన విజేతలకు 15వ తేదీ సాయంత్రం జరుగు కార్యక్రమం లో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు .అకాడమీలో సంగీతం నేర్చుకొనే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ రవి తెలియజేశారు. న్యాయనిర్ణేతలుగా శారద, రాంచరణ్, భానుహర్ష, మహేశ్వర రావు వ్యవహరించారు.

## ఏఎంసీ చైర్మన్, పిఎసిఎస్ అధ్యక్షులకు ఘన సన్మానం

**విశాలాంధ్ర-దత్తిరాజేరు :** మండల పరిషత్ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, పిఎసిఎస్ అధ్యక్షురాలు వంగపండు అలివేణిలకు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, ఘనంగా సన్మానం చేశారు నాయకులు సాలువతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. రైతుల సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తామని, రైతులకు ఎరువులు, రుణాలు సకాలంలో అందించేలా చర్యలు చేపడతామని సన్మాన గ్రహీతలు తెలిపారు.

## వివాహనికి చేయూత

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** పేదింటి అమ్మాయి వివాహనికి మేమున్నాం అంటూ జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ ముందుకు వచ్చింది. ఆదివారం సంఘం కార్యాలయం లో జరిగిన సమావేశం లో సంఘం అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ, దివ్యాంగుడైన సుగ్గు జగన్నాధం తన కుమార్తె పావని వివాహం గురించి ఆర్థిక సహాయం కోరారని, వెంటనే స్పందించిన గ్రూప్ సభ్యులు రూ 35వేలతో శతమానం, కాసు, కాలు కడిగే సామానులు, పట్టు చీర, పెళ్లి బట్టలు, సారె సమాకూర్చినట్లు శేఖర్ చెప్పారు, ఆదివారం పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు కార్యాలయం వద్ద అందజేసినట్టు తెలిపారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ విద్య, వైద్యం, వివాహంలకు చారిటీ గ్రూప్ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, ఏ.వి.కృష్ణారావు, బండి వెంకట కామేశ్వరరావు, చెన్నా బుచ్చి జనార్ధనారావు పాల్గొన్నారు.

## బైక్‌తో విద్యుత్ స్తంభానికి ఢీకొని యువకుడు మృతి

**విశాలాంధ్ర-రామభద్రపురం :** బైక్‌పై వచ్చి కరెంటు స్తంభానికి ఢీకొన్న సంఘటనలోఒక వ్యక్తి మృతి చెందాడని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జన్నివలస పంచాయతీ చిన నేరాళ్ల వలస కు చెందిన కుదుమూరు కన్నప్పదొర 33సం, పల్సర్ బైక్ పై రామభద్రపురం శనివారం సాయంత్రం కూరగాయలు కొనేందుకు బయలుదేరి వచ్చాడు. రామభద్రపురంలో కూరగాయలు కొనుక్కొని తిరిగి స్వగ్రామం వెళుతుండగా జన్నివలసా గెడ్డ ముందు ఉన్న కరెంటు స్తంభముకు అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కన్నప్పదొర తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి 9:30 గంటలు కావడంతో ఈ ప్రమాదాన్ని ఎవరు గమనించలేదు. రోడ్డు పక్కనే ఉన్న కన్నప్ప దోర నుఆదివారం ఉదయం కొంతమంది వ్యక్తులు గుర్తించారు. ప్రమాదం జరిగే విషయాన్నీ బంధువులకు తెలియపరిచారు. భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన అన్నారు. శ వ పంచనమా కొరకు మృతదేహాన్ని బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించేమని అన్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించమని తెలిపారు. అలాగే భర్త మృతి చెందడంతో భార్య భవాని కన్నీరు మున్నూరుగా ఏడ్చింది. అలాగే గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

## మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు : పోస్టర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర-రాజాం :** ఈనెల 22 తేదీన మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఘంటసాల సంగీత కళాశాల,రాజాం చిరంజీవి అభిమానుల వారి పరివేక్షణలో "పాటల పోటీలు" నిర్వహించబడుచున్నవి. మొదటస్థానం గెలుపొందిన వారికి మెమొంటోతో పాటు 3,000?, రెండవ స్థానం గెలుపొందిన విజేతకు మెమొంటోతో పాటు 2,000?, మూడవ స్థానం గెలుపొందిన వారికి మెమొంటో తోపాటు 1,000?నగదు బహూకరించబడునని, తదుపరి మెగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనగలరు. ఈ కార్యక్రమం 10:08:2025 ఆదివారం రాజాంలో శ్రీ విద్యానికేతన్ స్కూల్లో తెలగావీధి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడును.మెట్టు దామోదర్ రావు, వై.సురేష్ కుమార్, కొత్త సాయి ప్రశాంత్ కుమార్, శ్రీమతి గట్టి పద్మావతి, బొడ్డు వీరస్వామి, టంకాల సత్యం నాయుడు న్యాయ నిర్ణయతులగా వ్యవహరిస్తారు. 15:8:25న మొక్కలు నాటే కార్యక్రమం ఎంపీయుపి స్కూల్ ములకలవలస గ్రామం, 16:8: 25న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర ఉదయం పేదలకు అల్పాహారం వితరణ, 17:8:25న మెగా రక్త దాన శిబిరం ఉదయం 9 గంటలకు శ్రీ విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో,18:8:25న కొండంపేటలో గల అనాథ వృద్ధాశ్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం,19:8:25న పొగిరి కుష్టి నివారణ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, 20:8:25న రాజాం గవర్నమెంట్ హాస్పిటల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం, 22:8:25న మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు నాడు స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమం, తాజ్ బేకరీ ఆవరణలో కేక్ కటింగ్ జరుగును అని చిరంజీవి అభిమానుల సంఘం తెలిపారు. ఈ పాటల పోటీ కార్యక్రమంలో పాల్గొనేవారు ఈ నెంబర్లలో .9949783863, 8520033400,9393143929,9951651065. సంప్రదించగలరని తెలిపారు.

## సీతం కాలేజీలో రెండు వారాల మేరెన్ స్టాక్ వర్క్‌షాప్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** సీతం కళాశాలలో సి ఎస్ సి విభాగం ఆధ్వర్యంలో జూలై 21 నుండి ఆగస్టు 2 వరకు రెండు వారాల హ్యాండ్స్-ఆన్ మేరెన్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని డా. జి. వేణుమాధవ రావు పర్యవేక్షణలో చేపట్టారు.ఈ వర్క్‌షాప్‌లో సుమారు 80 మంది మూడో సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా, ఫైనల్ ఇయర్ విద్యార్థులు గిదుతూరి పూర్ణచంద్ర శేఖర్, వడ్లమాని వెంకట సాయి వంశీ కృష్ణ , ప్రణవ్ సాయ్ కటకం, ట్రైనింగ్ బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు టెక్నాలజీస్ పై ప్రాజెక్ట్ ఆధారిత శిక్షణ తీసుకొని, లైవ్ న్యూస్ బ్లాగ్ అప్లికేషన్ తయారు చేయడం జరిగింది. చివరి రోజున 13 టీములు తమ ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ డా. డి.వి. రామమూర్తి, డైరెక్టర్ డా. ఎం. శశిభూషణరావు ఇతర అధ్యాపకుల సమక్షంలో విద్యార్థులు ప్రదర్శించారు. శిక్షణకర్తల కృషిని గుర్తించి వారికి నగదు బహుమతులు అందజేయడం జరిగింది. సి ఎస్ సి విభాగం తరఫున ఈ కార్యక్రమాన్ని చేయడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఆరికతోట వద్ద టిఫిన్ కొట్టులోకి దూసుకువెళ్లిన ఆటో

**విశాలాంధ్ర-రామభద్రపురం:** మండలంలోని ఆరిగితోట టిఫిన్ కూడా జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం విజయనగరం నుంచి వస్తున్న లారీ టిఫిన్ చేసేందుకు డ్రైవర్ పక్కనే నిలబెట్టాడు. డ్రైవరు టిఫిన్ చేసిన తర్వాత లారీని ముందుకు తీశాడు. ఎదురుగా ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. బొలెరో వాహనం పక్కనే ఉన్న గొంతులో పడిపోయింది. అలాగే ఎదురుగా ఉన్న బొండాలు ల్లోడుతో ఉన్న ఆటోను ఢీకొట్టాడు ఆటో అక్కడ టిఫిన్ కోర్టులో దూసుకువెళ్ళింది. అలాగే ఎదురుగా ఉన్న రెండు బైకులు పై లారీ దూసుకుని వెళ్ళింది. బైకులు నుజ్జునుజ్జయిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు. అక్కడ ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశారు.

## రాజాం ప్రెస్‌క్లబ్ లో ఫ్రెండ్‌షిప్‌డే

**విశాలాంధ్ర-రాజాం:** ప్రపంచ స్నేహితుల దినోత్సవ సందర్భంగా రాజాం ప్రెస్ క్లబ్ లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందరూ కలిసి ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ చేసి ఒకరికి ఒకరు శు భాకాంక్షలు తెలుపుకొని ఆనందంగా గడిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పెంకి వెంకట్రావు మాట్లాడుతూ రక్తసంబంధం లేకుండా ఈ ప్రపంచంలో మన కోసం ఆలోచించే బంధం ఏదైనా ఉంది అంటే అది స్నేహబంధం మాత్రమే అని, అలాగే మనందరం స్నేహభావంతో మెలిగి అందరి మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందరూ హాజరయ్యారు.

## 20 వేలు ఇస్తానని చెప్పి 5 వేలే వేశారు...

**విశాలాంధ్ర-రామభద్రపురం:** 3024లో జరిగిన సాధారణ ఎన్నికలలో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అనేక అబద్ధపు హామీలు గుర్తించారని వాటిని నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నేడు ఘోరంగా విఫలం చెందిందని బొబ్బిలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పేరుతో 20వేలుఇస్తామని చెప్పి నేడు 5వేలు రైతులు ఖాతాలో జమ చేసిమోసం చేశారుఅని అన్నారు. కార్యక్రమంలో ఎం పి పి చో క్కపు లక్ష్మణరావు దర్రు పైడి రాజు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**విశాలాంధ్ర -వేపాడ:** మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామ సమీపంలోని రైవాడ కాలువ కల్వర్టు దగ్గర శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు.ఇందుకు సంబంధించి స్థానికులు, శృంగవరపుకోట రూరల్ సీఐ అప్పలనాయుడు అందించిన వివరాల మేరకు శనివారం రాత్రి ఆది వారం వేకువజామున మూడు నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని సిఐ అప్పలనాయుడు తెలిపారు.ఈ సంఘటన సంబం ధించి మృతుడి పూర్తి వివరాలు తెలియ రాలేదని అలాగే ఏ వాహనం ఢీ కొట్టిందో అన్న విషయం తెలియ రాలేదన్నారు.ఈ సంఘటనకు సంబంధించి దర్యాప్తునకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ఎస్.కోట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించామన్నారు.ఈ విష యం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిపారు.పూర్తి వివరాలతో సమాచారం అందించాలని వల్లంపూడి పోలీసులకు ఆదేశించినట్లు తెలిపారు. అలాగే మృతుడుని ఏ వాహనం ఢీ కొట్టిందో తెలుసుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు వల్లంపూడి ఎస్ఐ ఎస్. సుదర్శన్ తెలిపారు.

## ఎస్.కోటలో అంతంత మాత్రంగానే తంతి తపాలా సేవలు

### పోస్ట్‌బాక్స్ తుప్పుపడుతున్నా పట్టని వైనం...

**విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ :** గతంలో ఊరేగింపుల్లో, సినిమా పాటల్లో ప్రతీకగా నిలిచే పోస్ట్ బాక్స్ ఇప్పుడు తంతి తపాలా శాఖ అశ్రద్ధకు గురవుతోంది. ఎస్.కోట మండలంలోని దేవి జంక్షన్ వద్ద ఉన్న పోస్ట్ బాక్స్ నెల రోజులుగా తెరవబడలేదని, తుప్పుపట్టి, తాళాలు ముక్కలవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని ఏళ్ల ముందు పోస్ట్ బాక్స్‌లో ఉత్తరాలు వేస్తే రెండు రోజుల్లోగానీ, వారానికి రెండుసార్లు గానీ పోస్టుమాన్ వచ్చి వాటిని సేకరించి, గమ్యస్థానానికి చేరుస్తుండేవారు. కానీ ఇప్పుడు ఈ బాక్స్ నెలల తరబడి ఉపేక్షించబడింది. తాళాలు పాడయ్యాయి, బాక్స్ తుప్పు పట్టింది, ఎప్పుడు తెరుస్తారో తెలియదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది కేవలం ఒక పోస్ట్ బాక్స్ సమస్య కాదు, ప్రభుత్వ సేవల నాణ్యతపై ప్రశ్న అని గ్రామస్తులు తెలిపారు. ఉత్తరాలు, డాక్యుమెంట్లు అత్యవసరంగా పంపాల్సిన వారికి ఇది పెద్ద ఇబ్బంది కలిగిస్తోంది. కొందరు పోస్టాఫీసు వరకు వెళ్లాల్సి వస్తోందని, ఇది సమయం, డబ్బు నష్టానికి దారితీస్తోందని ఫిర్యాదు చేశారు. తపాలా శాఖ అధికారులు ఈ సమస్యపై తక్షణం దృష్టి పెట్టి, పోస్ట్ బాక్స్ ను మరమ్మతు చేయాలని, రోజువారీ సేకరణను నిర్బంధంగా ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్మార్ట్ ఇండియా యుగంలో కూడా ప్రాథమిక సేవలు నిలబడతాయని భావించే వారికి ఇది ఒక దిగ్భ్రాంతికరమైన సందర్భం. తపాలా బాక్స్ తెరవడం కూడా ఇప్పుడు ఒక ఔత్సాహిక కార్యక్రమమైపోయింది అంటూ స్థానిక యువకులు వ్యంగ్యం చేస్తున్నారు. ఈ సమస్య త్వరితగతిన పరిష్కరించబడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఇన్వెస్టిట్యూట్ వేడుక

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** కామాక్షి నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో ఇన్వెస్టిట్యూట్ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయనగరం డీఎస్పీ ఎం శ్రీనివాసరావు విచ్చేశారు . ఈ కార్యక్రమం పిల్లల స్కూల్ ఎలక్షన్స్ లో ఎన్నిక కాబడిన విద్యార్థులకు బ్యాడ్జెస్ అందజేశారు. ఈ సందర్భంగా.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రావు గెలుపొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నతికి స్థితికి ఎదగాలని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి జగదీష్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ , డీన్ త్రినాథ్, సి బ్యాచ్ ఇంచార్జ్ సతీష్ , ఏ వో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు..

## పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రులు అనిత, కొండపల్లి

### అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు
### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విశాలాంధ్ర-పూసపాటిరేగ:** మండలంలోని నడిపిల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గదులను, పాఠశాల ప్రహరీ గోడను రాష్ట్ర హోం శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం ఆర్థిక సిఎస్సార్ నిధులు రూ.18.50 లక్షలతో ఈ తరగతి గదులను, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.9.48 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు. మంత్రులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం రాష్ట్రంలో ఒకవైపు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే, సంక్షేమానికి కూడా అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన గొప్ప దార్శనికత కలిగిన నేత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా ముందుకు వెళ్తోందని చెప్పారు. ముఖ్యంగా విద్యారంగానికి, మౌలిక వసతుల కల్పనకు ఎనలేని ప్రాధాన్యత నిస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తూ భవిష్యత్ తరాలకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. రాష్ట్రం అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కష్టకాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతాయుతంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన అవకాశాలు కల్పించడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 20 ఏళ్ల పాటు కూటమి పాలన సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. కూటమిలోని పక్షాలన్నీ స్నేహపూర్వక వాతావరణంలో ముం దుకు సాగాలని ప్రజలకు మేలు చేసేందుకు ముందుకు రావాలని మంత్రి సూచించారు. నెల్లిమర్ల శాసన సభ్యురాలు లోకం నాగ మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఇందుకోసం అన్ని పక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని సూచించారు. కూటమి ప్రభుత్వం పి త్రీ, పి ఫోర్ ద్వారా చేస్తున్న కార్యక్రమాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, చిన్న చిన్న వ్యాపారాలు పట్ల దృష్టి సారించి, మహిళలు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని ఆమె సూచించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందని వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు.ఇటీవల జాతీయ, రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన గుంపాం పాఠశాల విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా అభినందించి, పతకాలను, సర్టిఫికెట్లను ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అధితి విజయలక్ష్మి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారు రాజు, డిసిసిబి చైర్మెన్ కిమిడి నాగార్జున, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ రామారావు, సర్పంచ్ గాయిత్రి, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 5 నుండి 16 వరకు 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

### ఏపీజీ ఈఏ అధ్యక్ష, కార్యదర్శులు కంది వెంకటరమణ, బి బాలభాస్కరరావు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** ఈనెల ఐదు నుండి 16వ తేదీ వరకు రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజి ఈఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంది వెంకటరమణ, బలివాడ బాల భాస్కరరావు అన్నారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పేరుకుపోయిన బకాయిలు,పెండింగ్ సమస్యల పరిష్కారానికి వినూత్న పద్ధతిలో ఈనెల 5 నుండి 16 వరకు రండిటీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరగబోతుందన్నారు. అందులో భాగంగా జిల్లాలో గల 10 తాలూకాలలో , జిల్లా కేంద్రంలోనూ కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు దీనిలో భాగంగా ఈనెల ఐదున కలెక్టరేట్ కేంటీన్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.ఆగస్టు16న కార్యక్రమంపై చర్చ ఏపీజీఇఎఆవిర్భావ దినోత్సవం నిర్వహించబడుతుందని తెలియజేసారు. కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వెంకటేశ్వరరావు, వై.ఆర్.అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శి పెనుమత్స మేరి,జి.లక్ష్మీ నాయుడు,తాలూకా అర్బన్ ఉపాధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రోగ్రెసివ్ సఫారీ కర్మచారి సంఘం

### పలు అంశాలపై చర్చ

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ప్రోగ్రెసివ్ సఫారీ కర్మచారి సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం జాతీయ అధ్యక్షులు ఈ వీర్రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ప్రోగ్రెసివ్ సఫారీ కర్మచారి రాష్ట్ర అధ్యక్షులు జి ఆంజనేయులు ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్ లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా పారిశుద్ధ్య కార్మికులు పిల్లలకు చదువుల్లో ప్రతి కార్యాలయంలో గుర్తింపు ఇవ్వాలని, ఉద్యోగాలు భర్తీ చేసేటప్పుడు పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చే విధంగా చూడాలన్నారు. చాలీచాలని జీతాలు ప్రభుత్వాలు చెల్లిస్తుందని వారికి 26,000 వేతనాలు చెల్లించాల న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు అందవలసిన ప్రతి సదుపాయాలను సంఘం ద్వారా అదేవిధంగా చూస్తామన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా రాష్ట్ర ప్రోగ్రెస్ సఫారీ కర్మ చారి అధ్యక్షులు జలగడుగుల కామేష్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు రాష్ట్ర వర్కింగ్ కమిటీలో తెలియజేయడమైనది, ఈ కార్యక్రమంలో ప్రోగ్రెస్సీ సఫాహికరంచారి ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నై శ్రీను, దశమంతల శ్యాం కుమార్ పాల్గొనడం జరిగింది. ..

## ఆధాని విధ్యుత్ మీటర్లు వద్దు

### ట్రూ అప్ చార్జీల రద్దు కై 5న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

### ప్రజా వేదిక సభలో కార్యదర్శి రెడ్డి శంకర రావు పిలుపు

**విశాలాంధ్ర- విజయ నగరం రూరల్ :** ట్రూ అప్ చార్జిలు రద్దు ఆధాని మీటర్లు వద్దు అని ప్రజలంతా తిరగ బడాలని రాష్ట్ర వ్యాప్తంగా 5 న విధ్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గునాలని ప్రజా వేదిక నాయకులు రెడ్డి శంకర్‌రావు పిలుపు నిచ్చారు. ఆదివారం గురజాడ నగర్లో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన ప్రజా వేదిక సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రములో చంద్రబాబు కూటమి అధికారం లోకి వచ్చి 14 నెలల కాలంలో 18,600 కోట్లు విద్యుత్ భారం వేశారని. ఇప్పుడు మరల మరో సారి 1200 కోట్లు బారాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. మరో వైపు కాలనీల్లో పేదల ఇళ్ళకి,అపార్ట్మెంట్ ల్లోఆధాని విధ్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఇప్పటికే వస్తున్నారన్నారు. మీ ఇంటికి వస్తే అడ్డుకొని తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. విధ్యుత్ స్మార్ట్ మీటర్స్ వద్దు.. ట్రూఆఫ్ చార్జిలు రద్దు అని ప్రజలంతా నిరసన తెలపాలని అన్నారు. కూటమి నేతలు ఎన్నికల ముందు ఒక మాట, అధికారం వచ్చాక మరో మాట మాట్లాడు తున్నారని, ఇప్పటికే పెరిగిన విధ్యుత్ భారం మోయలేకపోతున్నారన్నారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బంగారం, రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘ కార్యదర్శి రంభ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మాయమాటలు విని మహిళలు తమ జీవితం నాశనం చేసుకోవద్దు

### ఎస్సై బి.దేవి

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** మహిళలు మాయ మాటల విని జీవితాలను నాశనం చేసుకోవద్దని ఒకటవ పట్టణ ఎస్సై బి దేవి అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పి గోవిందరావు ఆదేశాలతో తోటపాలెంలో ఒక లేడీస్ హాస్టల్ లో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలంతా అప్రమత్తంగా ఉండాలని లేనిపోని మాయి మాటలు విని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మహిళలకు అండగా శక్తి వారియర్స్ టీం పనిచేస్తుందన్నారు. మహిళలంతా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా మహిళలకు ప్రమాదాలు జరగకుండా ఉపయోగపడుతుందన్నారు. మహిళలకు జరిగే ప్రమాదాలకు నిరంతరం శక్తి టీం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రస్తుతం మహిళల కోసం సెల్ఫ్ డిఫెన్స్, టెక్నిక్స్ నేర్పించేందుకు శక్తి వారియర్స్ టీం సిద్ధంగా ఉందన్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం మహిళా విద్యార్థులు కూడా తమ దృష్టి అంతా కేవలం విద్య పైనే కేంద్రీకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉత్తమ విద్యనభ్యసించి ఉన్నత ఫలితాలు సాధించేందుకు ప్రయత్నం చేయాలన్నారు.